సాక్షి
వికారాబాద్

ఆదివారం । 17 । నవంబర్ । 2024



పేద విద్యార్థులకు చేయూత

పేద విద్యార్థులకు దాతల సహకారం ఎంతో అవసరమని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. 8లో▸



రైతుల అభ్యున్నతే లక్ష్యం

రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. 9లో▸



దివ్యాంగుల సంక్షేమమే..

దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి బీ కృష్ణవేణి అన్నారు. 9లో▸



జాతరకు తరలివస్తున్న యాత్రికులు



ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరలో భాగంగా శనివారం ఏసుక్రీస్తు శిలువ వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

- మరిన్ని వివరాలు 9లో▸

న్యూస్‌రీల్

సత్ప్రవర్తనతో మెలగాలి

జిల్లా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబర్ వెంకటేశ్



ఖైదీలతో మాట్లాడుతున్న వెంకటేశ్

పరిగి: ఒక్క సారి జైలు జీవితం గడిపిన వారు మళ్లీ జైలుకు రాకుండా సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబర్ వెంకటేశ్ సూచించారు. శనివారం మండల న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో పరిగి సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జైలులో ఉన్న ఖైదీలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. కొంత మంది అనుకోని సంఘటనల వల్ల, మరి కొంత మంది క్షణికావేశంలో చేసిన తప్పులకు జైలుపాలవుతుంటారని తెలిపారు. జైలు జీవి తం గడపం అంటే మంచి ప్రవర్తన గల వ్యక్తిగా మారడమేనని పేర్కొన్నారు. బెయిల్ పిటిషన్ వేసుకోని వారు ఉంటే వారికి ఉచితంగా పిటీషన్ వేస్తామని అన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రాజ్ కుమార్, న్యాయ వాది గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం ఏఓగా శ్రావ్య



బంట్వారం: మండల వ్యవసాయ శాఖ అధికారిగా శ్రావ్య శనివారం పట్టణంలోని రైతు వేదికలో గల కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఏఓ సంధ్య రెండు నెలల క్రితం సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మర్పల్లి ఏఓ శ్రీకాంత్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తూ వచ్చారు. ప్రభుత్వం బంట్వారం ఏఓగా శ్రావ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటూ సాగుపై ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తానని పేర్కొన్నారు.

ధారూరు మార్కెట్‌కు మొక్కజొన్నలు

ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 733 సంచుల మొక్కజొన్నలు వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు. వ్యాపారులు నిర్వహించిన బీట్లలో క్వింటాలుకు రూ.2,355 నుంచి రూ.2,490 వరకు ధర పలికినట్లు తెలిపారు. అలాగే వరిలో 1010 రకం(సన్నవి) 390 సంచులు వచ్చాయని, క్వింటాలుకు రూ.2,070 నుంచి రూ.2,150 వరకు ధర చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేశారని వివరించారు.

శుభకార్యానికి వచ్చి.. శవమై కనిపించి..

యువకుడి అనుమానాస్పద మృతి



రాణాప్రతాప్ (ఫైల్)

పూడూరు: బంధువుల ఇంట శుభకార్యానికి వచ్చిన ఓ యువకుడి బయటికి వెళ్లి శవమై కనిపించాడు. ఈ ఘటన పూడూరు మండలం చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నవాబుపేట మండలం అక్నాపూర్‌కు చెందిన పెద్ద గొల్ల శ్రీకాంత్‌కు నెలరోజుల క్రితం కూతురు పుట్టింది. గత నెల 25న పూడూరు మండలం చీలాపూర్‌లో పురుడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాంత్‌కు వరుసకు సోదరుడైన పెద్దగొల్ల రాణాప్రతాప్ (28) అక్నాపూర్ నుంచి చీలాపూర్‌కు వచ్చాడు. అదే రోజు రాత్రి 8:30గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో చన్గోముల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం మండలంలోని కండ్లపల్లి శివారులో కుళ్లిన శవం లభించింది. బైక్ ఆధారంగా మృతుడు రాణాప్రతాప్‌గా పోలీసులు నిర్ధారించారు. పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

19న రౌండ్ టేబుల్ సమావేశం

అనంతగిరి: 'నీటి భద్రత, మూసీ పునరుజ్జీవం ,హనుమంతరావు చతుర్విధ జలప్రక్రియ' అంశాలపై ఈనెల 19న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్‌లోని ఎస్‌ఏపీ కాలేజీలో మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు.

కిట్.. కట్!

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి.. మాతాశిశు సంరక్షణ కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నాం.. గర్భం దాల్చింది మొదలు పురుడు పోసుకునే వరకు మెరుగైన వైద్య సేవలు.. ఇవీ అధికారులు, నాయకులు చెప్పే మాటలు.. అయితే ప్రస్తుత ప్రభుత్వం కొన్ని పథకాలకు మంగళం పాడటంతో ఆ ప్రభావం సర్కారు ఆస్పత్రుల్లో ప్రసవాలపై పడింది. ఒక్క తాండూరు జిల్లా ఆస్పత్రిలోనే దాదాపు సగానికి పైగా ప్రసవాలు తగ్గాయి.



తాండూరులోని మాతాశిశు ఆస్పత్రి

- బీఆర్ఎస్ హయాంలో తల్లీబిడ్డల కోసం కేసీఆర్ కిట్ల పంపిణీ
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేరు మార్పు
- హెల్త్ కిట్ పేరిట స్కీమ్
- ఆరంభం నుంచే అమలు కాని వైనం
- 'అమ్మ ఒడి'దీ అదే పరిస్థితి
- తాండూరు ఆస్పత్రిలో సగానికి పైగా తగ్గిన ప్రసవాలు

తాండూరు జిల్లా ఆస్పత్రిలో జరిగిన ప్రసవాలు

సంవత్సరం	ప్రసవాలు
2017-18	2,422
2018-19	3,935
2019-20	4,240
2020-21	3,900
2021-22	5,700
2022-23	5,700
2023-24	2,350



కేసీఆర్ కిట్ (ఫైల్)

తాండూరు: తల్లిబిడ్డ సంరక్షణ కోసం గత ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్, అమ్మ ఒడి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కేసీఆర్ కిట్ పథకం పేరు మార్చింది. హెల్త్‌కిట్ పేరిట అమలు చేస్తామని ప్రకటించింది. ఏడాది కావస్తున్నా పథకం అమలుకు నోచుకోక బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. పేద కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడిన కేసీఆర్ కిట్ పథకం ఉన్నట్లుండి ఆపేయడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఏటా వేల సంఖ్యలో ప్రసవాలు జరుగుతాయి. కాన్పులు చేయించుకున్న వారికి ఈ పథకాలు అమలు చేయడం లేదు. తాండూరు మాతాశిశు ఆస్పత్రిలో, వికారాబాద్‌లోని ఏరియా ఆస్పత్రి తోపాటు సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరుగుతాయి.

అటకెక్కిన అమ్మ ఒడి

సర్కారు దవాఖానాల్లో ప్రసవాలు చేయించుకుంటే గత ప్రభుత్వం కేసీఆర్ కిట్ తోపాటు పేద, మధ్య తరగతి గర్భిణులకు మగ బిడ్డ పుడితే రూ.12 వేలు, ఆడ బిడ్డ పుడితే 13వేల రూపాయలు తల్లుల ఖాతాలో జమ చేసింది. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో పాటు రెండు సార్లు చికిత్స పొందితేనే పథకాలు వర్తించేలా నిబంధనలు పెట్టారు. దీంతో తాండూరు ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగాయి. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండు పథకాలు ఆగిపోయాయి.

కిట్‌లో 15రకాల వస్తువులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకునే తల్లులకు రూ.2వేల విలువ కలిగిన కేసీఆర్ కిట్‌ను అందించేవారు. కిట్‌లో 15 రకాల వస్తువులు ఉండేవి. శిశువుకు రూ.200 విలువ చేసే దుస్తులు, రూ.100 విలువ చేసే టవల్స్, రూ.90 విలువ చేసే మస్కిటోస్, రూ.350 విలువ చేసే దోమతెర, న్యాప్‌కిన్, పౌడర్, షాంపో, అయిల్, సోప్ బాక్స్, ఆట వస్తువులు, బేబీ సోప్ అందించేవారు. తల్లికి ఒక బకెట్, రెండు చీరలు, రెండు సబ్బులు, కిట్‌బ్యాగ్ ఇచ్చేవారు.

స్టాక్ రాగానే పంపిణీ చేస్తాం



కాంగ్రెస్ ప్రభుత్వం బాలింతల కోసం హెల్త్ కిట్ పథకం అమలు చేసింది. స్టాకు ఉన్నంత వరకు బాలింతలకు కిట్లు పంపిణీ చేశాం. జనవరిలో స్టాక్ అయిపోయింది. అప్పటి నుంచి పంపిణీ చేయడం లేదు. స్టాక్ వస్తే పంపిణీ చేస్తాం. ఇందుకోసం అర్హులైన వారి పేర్లను నమోదు చేశాం.

– రవిశంకర్, సూపరింటెండెంట్, తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- పొలంలో చెట్టుకు ఉరేసుకుని మృత్యువాత



మహిపాల్‌రెడ్డి(ఫైల్)

ధారూరు: అప్పుల బాధతో విరక్తి చెందిన ఓ రైతు పొలంలో ఉరేసుకుని తనువు చాలించాడు. ధారూరు మండలం హరిదాస్‌పల్లిలో శనివారం ఈ ఘటన వెలుగుచూసింది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి(45) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తనకున్న మూడున్నర ఎకరాలతో పాటు నాలుగేళ్ల క్రితం వికారాబాద్ మండలం గొట్టిముక్కుల గ్రామంలో మరో పదెకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. పంటల సాగు కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద సుమారు రూ.14 లక్షల వరకు అప్పులు చేశారు. హరిదాస్‌పల్లి పీఏసీఎస్‌లో రూ.1.20 లక్షల పంట రుణం తీసుకున్నాడు. వ్యవసాయంలో ఏటా నష్టాలే రావడంతో అప్పులు తీర్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈక్రమంలో మనస్తాపానికి గురై ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి స్వగ్రామంలోని పొలం వద్దకు వెళ్లి, చెట్టుకు ఉరేసుకున్నాడు. శనివారం పొలానికి వెళ్లిన మృతుని సోదరుడు కమాల్‌రెడ్డి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అక్కడకు చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం శవాన్ని అప్పగించారు. మృతుడి కొడుకు సంతోష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహిపాల్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- గ్రూప్–3 పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష

అనంతగిరి: గ్రూప్–3 పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడిషనల్ ఎస్పీ, రవీందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ సుధీర్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి చీఫ్ సూపరింటెండెంట్లు, ఆయా శాఖల అధికారులు, పరిశీలకులు, రూట్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. నేడు, రేపు (17, 18 తేదీల్లో) జరగనున్న గ్రూప్–3 పరీక్షలకు అన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. 31 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని, సెంటర్లలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. ఫర్నిచర్, ఫ్యాన్లు, ఇతర సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని, 9.30 గంటల తర్వాత ప్రవేశం ఉండదన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు తెచ్చుకోరాని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ వాసుచంద్ర, అబ్జర్వర్ డాక్టర్ శ్రీధర్, రీజియన్ కోఆర్డినేటర్ డాక్టర్ నరేందర్ రెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిని హత్య చేసిన కొడుక్కి రిమాండ్

- వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి

యాలాల: తల్లిని హత్య చేసిన కేసులో నిందితున్ని శనివారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ శంకర్‌తో కలిసి వెల్లడించారు. మండలంలోని జక్కేపల్లికి చెందిన బొల్లె చంద్రమ్మ(70), మల్లప్ప దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నాడు. మృతురాలు చంద్రమ్మ సోదరి అయిన నర్సమ్మ భర్త 20 ఏళ్ల క్రితం చనిపోయాడు. పిల్లలు లేకపోవడంతో చంద్రమ్మతో కలిసి జక్కేపల్లిలో ఉంటోంది. నర్సమ్మ వద్ద రూ.2 లక్షల నగదు, తులం బంగారం దాచుకుంది. తొమ్మిదేళ్ల క్రితం నర్సమ్మ మృతి చెందడంతో కుటుంబ సభ్యుల సమక్షంలో రూ.2లక్షల నగదు వెంకటయ్య తీసుకున్నాడు. తులం బంగారాన్ని చంద్రమ్మ చిన్న కూతురు తిప్పమ్మ వద్ద పెట్టుకుంది. తాగుడు, జల్సాలకు అలవాటు పడిన వెంకటయ్య రూ.2లక్షలు ఖర్చు పెట్టేశాడు. చేతిలో డబ్బులు లేకపోవడంతో తులం బంగారం కోసం తరచూ తల్లి చంద్రమ్మ, చెల్లెలు తిప్పమ్మను వేధించే వాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో బంగారం విషయమై తల్లితో గొడవకు దిగిన వెంకటయ్య రోకలి కర్రతో చంద్రమ్మపై దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన చంద్రమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. తిప్పమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణలో నిందితుడు తన నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. అనంతరం నిందితుడైన వెంకటయ్యను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

బీసీ మహాసభ రంగారెడ్డి అధ్యక్షుడిగా శ్రీను

షాద్‌నగర్‌రూరల్: బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా క్యాసెట్ శ్రీనివాస్ నియమితులయ్యారు. శనివారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో బీసీ మహాసభ సమావేశాన్ని నిర్వహించారు. బీసీ మహాసభ విస్తృత నిర్మాణంలో భాగంగా బీసీ మహాసభ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ హాజరై నియామకపత్రాలు అందజేశారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా గోపాల్, ప్రధాన కార్యదర్శిగా యాదయ్య, కార్యదర్శిగా బన్సీలాల్, కోశాధికారిగా వెంకటాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీసీ మహాసభ యువత విభాగం జిల్లా అధ్యక్షుడిగా శ్రీధర్‌వర్మ, ఉపాధ్యక్షులుగా మంగవెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం, కార్యదర్శిగా మహేశ్‌గౌడ్, కోశాధికారిగా శ్రీనివాసాచారి, ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా సురేష్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా లలిత, జిల్లా ప్రచార కమిటీ ఇన్‌చార్జిగా మల్లేష్‌ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీసీ మహాసభ నాయకులు పాల్గొన్నారు.

రహదారి పనులకు రైతుల బ్రేక్

- ఫ్యూచర్ సిటీ రోడ్డు నిర్మాణానికి హద్దురాళ్ల ఏర్పాటు
- సమాచారం ఇవ్వకుండా పనులు ఎలా చేపడుతారని ఆగ్రహం
- అధికారులు నచ్చజెప్పినా ససేమీరా



కందుకూరు: ఫోర్త్‌సిటీ వరకు నిర్మించనున్న 300 అడగుల రహదారి నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ పనులకు ఆదిలోనే అడ్డంకులు ఎదురయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం రావిర్యాల ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబర్–13 నుంచి ఫోర్త్ సిటీ వరకు 300 అడుగుల మేర రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించింది. ఈ మేరకు శనివారం సర్వేయర్ సాయికాంత్, ఆర్‌ఐ యాదయ్య బృందం మండల పరిధిలోని రాచలూరు రెవెన్యూలో ఫోర్త్ సిటీ వరకు రహదారి నిర్మాణానికి హద్దురాళ్లు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించింది. విషయం తెలుసుకుని భూములు కోల్పోతున్న రాచులూరు, తుర్కగూడ, గాజులబురుజుతండా, బేగంపేటకు చెందిన రైతులు పనులను అడ్డుకుని నిరసన తెలిపారు. తాము కోల్పోతున్న భూమికి భూమి ఇస్తారా? లేక పరిహారం ఇస్తారా ఏదీ తేల్చకుండానే హద్దురాళ్లు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ఆర్డీఓ, తహసీల్దార్ రావాలంటూ భీష్మించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గోపాల్, సీఐ సీతారాం పోలీసులతో అక్కడికి చేరుకుని రైతులను సముదాయించినా ఫలితం లేదు. చివరకు రాచులూరుకు చెందిన అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి రైతులతో మాట్లాడారు. రైతులకు ఏమీ కావాలో అడిగితెలుసుకున్నారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి మాట్లాడదామని, రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని, అప్పటి వరకు పనులను అడ్డుకోవద్దని వారికి భరోసా కల్పించడంతో రైతులు శాంతించారు.

లగచర్లను వీడని భయం

- అధికారులపై దాడి జరిగి వారం రోజులు కావస్తున్నా చక్కబడని పరిస్థితులు
- అజ్ఞాతంలోనే పలువురు రైతులు
- కొనసాగుతున్న పోలీసుల గాలింపు
- తాజాగా మరో పది మంది అరెస్టు
- కలెక్టర్‌తో అడిషనల్ డీజీ ఉన్నత స్థాయి సమీక్ష
- అనంతరం ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో భేటీ

వికారాబాద్: లగచర్ల ఘటన జరిగింది మొదలు ఫార్మా బాధిత తాండాల్లో ఇంకా భయం వీడలేదు. కలెక్టర్, ఇతర అధికారులపై దాడి అనంతరం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహా 21 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే.. తాజాగా శనివారం మరో పది మందిని పోలీసుల అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇందులో ముగ్గురు కొడంగల్ సీఐ ముందు లొంగిపోగా మిగతా వారిని ప్రత్యేక పోలీసు బృందాలు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. అధికారులపై 110 మంది నుంచి 120 మంది వరకు దాడికి పాల్పడినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు ఐజీ సత్యనారాయణ ప్రకటించిన విషయం తెలిసిందే. ఐదు రోజులు క్రితం 57 మంది అనుమానితులను అదుపులోకి తీసుకొని దాడిలో ప్రమేయం ఉన్న 16 మందిని అరెస్టు చేసి మిగతా వారిని వదిలిపెట్టారు. ఆ మరుసటి రోజు మరో ఐదుగురు, తాజాగా మరో 10 మందిని కలుపుకొని 31 మందిని అరెస్టు చేశారు. అజ్ఞాతంలో ఉన్న వారి కోసం పోలీసు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. కొంత మంది రైతులు పూణే, ముంబైకి పోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

అడిషనల్ డీజీ ఉన్నత స్థాయి సమీక్ష

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన లగచర్ల ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ కేసును తొలుత ఎస్పీ నారాయణరెడ్డి, ఐజీ సత్యనారాయణ డీల్ చేయగా ప్రస్తుతం అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. గురువారం పరిగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన పోలీసు అధికారులతో సమావేశమై ఘటనపై పూర్తి వివరాలు సేకరించారు. శనివారం వికారాబాద్‌కు వచ్చి రెండు గంటలపాటు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో సమావేశమయ్యారు. అనంతరం బయటకు వచ్చిన ఆయన్ను మీడియా వివరాలు అడగ్గా.. విచారణ కొనసాగుతోందని, సమయం పడుతుందని దాటవేశారు. లగచర్ల ఘటన జరిగిన రోజు.. గ్రామంలోకి వెళ్లకముందు.. వెళ్లిన తర్వాత జరిగిన పరిణామాలన్నింటినీ కలెక్టర్‌తో చర్చించి రికార్డు చేసినట్లు తెలుస్తోంది. అనంతరం ఎస్పీ కార్యాలయానికి చేరుకొని జిల్లా పోలీసు అధికారులతో మరోసారి చర్చించినట్లు సమాచారం. కేసు విషయంలో ముున్ముందు న్యాయపరమైన చిక్కులు ఎదురవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పోలీసులకు అడిషనల్ డీజీ సూచించినట్లు సమాచారం. అయితే దాడిపై కలెక్టర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ పోలీసు శాఖలో తీవ్ర చర్చకు దారి తీసింది. రైతుల దాడిలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డికి గాయాలైన విషయం తెలిసిందే. వారి ఫిర్యాదు మేరకు మూడు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. అయితే దాడికి సంబంధించి కలెక్టర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఈ ఘటనను దాడిగా పరిగణించలేమని.. జస్ట్ తోశారంటూ కలెక్టర్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఇది ఇన్వెస్టిగేషన్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని కొందరు పోలీసు అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్.. కలెక్టర్‌తో రెండు గంటల పాటు సమావేశం కావడం వెనక ఇది కూడా ఓ కారణం కావచ్చనే చర్చ జరుగుతోంది.



ఉన్నత స్థాయి సమీక్ష అనంతరం కలెక్టర్‌తో కలిసి బయటికి వస్తున్నఅడిషనల్ డీజీ మహేశ్‌భగవత్

క్లుప్తంగా

నేడు కొడగల్‌లో సదర్‌ వేడుకలు

కొడంగల్‌: పట్టణంలో ఆదివారం సదర్‌ వేడుకలు నిర్వహించనున్నట్లు సంబరాల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు తెలిపారు. కొడంగల్‌ శివారులోని గాడిబాయి శివాలయం నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ఊరేగింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అఖిల భారత యాదవ మహాసభ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వేడుకల ప్రతినిధి డాక్టర్‌ రవీంద్రా యాదవ్‌ కోరారు.

అధిక సాంద్రత పత్తితో మంచి దిగుబడులు



పూడూరు మండలం గట్టుపల్లిలో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పూడూరు: అధిక సాంద్రత కలిగిన పత్తితో మంచి దిగుబడులు వస్తున్నాయని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్‌ టి.లక్ష్మణ్‌ అన్నారు. కేంద్ర పత్తి పరిశోధన కేంద్రం ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా శనివారం పూడూరు మండల పరిధిలోని గట్టుపల్లిలో రైతు సుధాకర్‌ వేసిన అధిక సాంద్రత గల పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర పంటల సాగు, పాటు, లింగాకర్షణ బుట్టల ఏర్పాటు ద్వారా చీడపీడలను నివారించవచ్చని తెలిపారు. సాధారణ పత్తి కంటే అధిక సాంద్రత పత్తి సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు యమున, మధు, కేశవ క్రిష్ణ, మాజిద్‌, మండల పరిధిలోని రైతులు తదితరులు పాల్గొన్నారు.

జూదరులపై కేసు

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలో పేకాటరాయుళ్లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని ఓ దుకాణం సమీపంలో కొనసాగుతున్న పేకాట స్థావరంపై శనివారం తెల్లవారుజామున పోలీసులు దాడి చేశారు. ఏడుగురు జూదరులను అరెస్టు చేసి, వీరినుంచి రూ.8,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని పీఎస్‌కు తరలించి, ఏడుగురిపై కేసు నమోదు చేశామని స్పష్టంచేశారు.

బాలిక అదృశ్యం

షాబాద్‌షరీఫ్‌: బాలిక అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బీహార్‌ రాష్ట్రానికి చెందిన వినోద్‌ రామ్‌ కుటుంబం ఐదు నెలల క్రితం జల్‌పల్లి శ్రీరాం కాలనీకి వలస వచ్చింది. అతని చిన్న కూతురు(16) కాలనీలోని పేపర్‌ ప్లేట్స్‌ తయారీ కంపెనీలో పని చేస్తోంది. ఈ నెల 15న కుటుంబ సభ్యులంతా నిద్రించి శనివారం ఉదయం 6గంటలకు లేచి చూడగా కనిపించలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. తాను పనిచేసే కంపెనీలోనే ఎవరో తీసుకుపోయి ఉంటారని బాలిక తల్లి సునీతా దేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌ గాని సమాచారం అందించాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

రెండు బైకులు ఢీ

ఇరువురికి గాయాలు

కేశంపేట: ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొనడంతో ఇరువురుకి తీవ్ర గాయలైన సంఘటన మండల పరిధిలో లేమామిడి శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కమ్మరి నందంచారి వ్యవసాయ పొలం పనులు ముగించుకుని సాయంత్రం బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ సమయంలో పోమాల్‌పల్లికి చెందిన మల్లేశ్‌ తన బైక్‌పై తలకొండపల్లి వెళ్తున్నాడు. లేమామిడి వద్ద వీరి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇరువురికీ గాయాలవగా అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ట్రా'ఫికర్‌'

- కొత్తూరులో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్‌
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పోలీసులు



దర్గా రోడ్డులో అస్తవ్యస్తంగా పార్కింగ్‌



పెంజర్ల రోడ్డులో ట్రాఫిక్‌ జామ్‌

కొత్తూరు: రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న కొత్తూరు మండల కేంద్రంలో ట్రాఫిక్‌ సమస్య ప్రధానంగా మారింది. స్థానికంగా పారిశ్రామిక వాడ ఉండడంతో ఆయా ప్రాంతాల నుంచి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు మండల కేంద్రం నుంచి రాకపోకలు కొనసాగిస్తుంటాయి. దానికి తోడు మండలం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే వాహనాల సంఖ్య కూడా వందల్లోనే ఉంటుంది. ఏమాత్రం రోడ్డుపై ఆటోలు, జీపులు నిలిపినా నిమిషాల వ్యవధిలోనే పదుల సంఖ్యలో వాహనాలు ఆగిపోతున్నాయి. ముఖ్యంగా కొత్తూరు–షాద్‌నగర్‌ పాత జాతీయ రహదారి, కొత్తూరు–జేపీదర్గా, కొత్తూరు–పెంజర్ల రోడ్డులో ట్రాఫిక్‌ మరింతగా పెరుగుతోంది.

ఇష్టారాజ్యంగా..

స్థానికులతో పాటు ఆయా ప్రాంతాల నుంచి పలు దుకాణాలు, ఇతర పనుల నిమిత్తం వచ్చే వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్‌ చేస్తున్నారు. కొందరు దుకాణాల నిర్వాహకులు కూడా రోడ్డు సమీపం వరకు తోపుడు బండ్లు, టీ స్టాల్స్‌ ఏర్పాటు చేస్తున్నారు. అసలే ఇరుకు రోడ్డు కావడంతో వీటి నిర్వహణతో రోడ్డు మరింత ఇరుకుగా మారుతోంది. దీనికి తోడు జేపీదర్గా, పెంజర్ల, షాద్‌నగర్‌ వైపునకు వెళ్లే ఆటో, జీపు డ్రైవర్లు ప్రయాణికులను ఎక్కించుకోవడానికి పోటీలు పడి వాహనాలను రోడ్డు మధ్యలో నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్‌ సమస్య మరింత జటిలమవుతోంది. ట్రాఫిక్‌ సమస్యపై తరచూ పత్రికల్లో కథనాలు వస్తున్నప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పకడ్బందీగా గ్రూప్‌– 3 పరీక్షలు

- సెంటర్ల వద్ద ఎలాంటి తప్పిదాలకు తావివ్వొద్దు
- ఏం జరిగినా సంబంధిత అధికారులే బాధ్యత వహించాలి
- తాండూరు సబ్‌ కలెక్టర్‌ ఉమాశంకర్‌ప్రసాద్‌



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌ కలెక్టర్‌ ఉమాశంకర్‌ ప్రసాద్‌

తాండూరు: గ్రూప్‌– 3 ఉద్యోగ అర్హత పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలని తాండూరు సబ్‌ కలెక్టర్‌ ఉమా శంకర్‌ప్రసాద్‌ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో గ్రూప్‌– 3 రూట్‌ అధికారులు, డిపార్ట్‌మెంట్‌ ఆఫీసర్లు, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌లతో సమీక్ష నిర్వహించారు. తాండూరులో గ్రూప్‌– 3 పరీక్షల కోసం మొత్తం 11 సెంటర్లను ఏర్పాటు చేశారు. వీటిలో మొత్తం 3,245 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు కొనసాగే ఎగ్జామ్స్‌ నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం సబ్‌ కలెక్టర్‌ మాట్లాడుతూ.. అభ్యర్థులను గంటన్నర ముందుగానే పరీక్షా కేంద్రాల్లోకి పంపించాలన్నారు. సెంటర్లలో జరిగే తప్పిదాలకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని తెలిపారు. మొదటి రోజు రెండు సెషన్‌లలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, 3నుంచి సాయంత్రం 5:30 వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు పట్టణంలోని జిరాక్స్‌ సెంటర్లను మూసేయాలని ఆదేశించారు. సోమవారం రోజు ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రెండు సెషన్ల పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. అభ్యర్థులు గడువు లోపు కేంద్రాలకు చేరుకోవాలన్నారు. సెంటర్ల వద్ద వద్ద బీఎన్‌ఎస్‌ 163, సీఆర్‌పీసీ 144 సెక్షన్‌లు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

షాద్‌నగర్‌: నిరుపేదల ఆరోగ్య సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లేడ్‌ చౌదరిగూడ, కొందుర్గు, కేశంపేట, ఫరూఖ్‌నగర్‌, షాద్‌నగర్‌ పట్టణానికి చెందిన 117 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.35లక్షల 38వేల 500ల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి మెరుగైన వైద్యం అందజేస్తుందన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరోగ్య శ్రీ పథకం కింద రూ.10లక్షల బీమా సదుపాయాన్ని అమలులోకి తీసుకొచ్చిందన్నారు. పేదలకు ఏ చిన్న కష్టం వచ్చినా ప్రభుత్వం అండగా నిలుస్తుందని, సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరంలాంటిందన్నారు. పేదలకు ఆరోగ్య సమస్యలు వస్తే ప్రైవేట్‌ ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిపుణులైన వైద్యులు మెరుగైన వైద్య సేవలను అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్‌, శివశంకర్‌గౌడ్‌, కొమ్ము కృష్ణ పాల్గొన్నారు.

శివసాగర్‌చెరువులో గుర్తు తెలియని మృతదేహం

- స్కూటీతో పాటు చెరువులో మునిగిన యువకుడు
- వికారాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో శవం

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణంలోని శివ సాగర్‌ చెరువులో శనివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చెరువులో మృతదేహం తేలిందని స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహం పక్కనే ఓ స్కూటీ కూడా ఉండటాన్ని గమనించారు. సదరు వ్యక్తికి సుమారు 25–26 వయసు ఉండొచ్చని భావిస్తున్నారు. మూడునాలుగు రోజుల క్రితమే మృతుడు చెరువులో పడి ఉంటాడని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. రాత్రి వేళ స్కూటీపై వెళ్తుండగా రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి దూసుకెళ్లి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ భీం కుమార్‌ స్పష్టంచేశారు.

కారు ఢీకొని ప్రభుత్వ ఉద్యోగి మృతి

శంషాబాద్‌: కారు ఢీకొని ప్రభుత్వ ఉద్యోగి మృతిచెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... మండలంలోని పోశెట్టిగూడ గ్రామానికి చెందిన కావలి దశరథ(40) జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి పట్టంలోని ఫ్లైఓవర్‌ మీదుగా బైక్‌పై ఇంటికి వెళుతుండగా కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలైన అతడిని వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు

కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

మైలార్‌దేవ్‌పల్లి: చిన్నారులు ఒంటరిగా రోడ్లపై విడిచి పెట్టాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. ఎటు నుంచి కుక్కలు దాడి చేస్తాయో అనే భయం పట్టుకుంది. చిన్నారులను చేయి పట్టుకొని రోడ్డుపై నడువాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ పరిధిలోని పద్మశాలీపురంలో శుక్రవారం రఫి, ఆయోషాలు దంపతులు వీరికి సంతానం గులాబ్షా(5) పాఠశాల నుంచి ఇంటికి వచ్చి ఆరు బయట కూర్చొని ఆడుకుంటుండగా వీధి కుక్కలు ఓ చిన్నారిపై ముకుమ్మడిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యింది. కాలి కండరాలు బయటికి కనబడేలా కరిచాయి. స్థానికులు కుక్కలను తరమడంతో చిన్నారి ప్రాణాలతో బయట పడింది. వెంటనే స్థానిక దవాఖానాకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. కుక్కల స్వైరవిహారం నుంచి చిన్నారులను కాపాడాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో కుక్కల దాడికి చిన్నారులు బలయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అధికారులు కుక్కలు ఉన్న ప్రదేశాలను గుర్తించి వాటిని తీసుకెళ్లాలని కోరుతున్నారు. మధుబన్‌ కాలనీ, టీఎన్జీవోస్‌ కాలనీ, పద్మశాలీపురం ప్రాంతాలలో కుక్క లు గుంపులుగా తిరుగుతున్నాయి. అధికారులు గుర్తించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

'అక్రమ కేసులను ఎత్తివేయాలి'

షాబాద్‌: దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామంలో జరిగిన ఘటనలో అరెస్ట్‌ అయిన కొడంగల్‌ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌ రెడ్డిని బేషరతుగా రిలీజ్‌ చేయాలని రుద్రారం మాజీ సర్పంచ్‌ బండ స్వర్ణలతసత్తియాదవ్‌ డిమాండ్‌ చేశారు. శనివారం షాబాద్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ.. నరేందర్‌రెడ్డితో పాటు రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి, వారిని బేషరతుగా విడుదల చేయాలన్నారు. ఫార్మా విలేజ్‌ ఏర్పాటుకు భూములను ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేసినా.. ప్రభుత్వం పదేపదే ప్రజాభిప్రాయ సేకరణతో ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు.

పేద విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు స్పోర్ట్స్‌ డ్రెస్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్‌, దాతలు

షాబాద్‌: పేద విద్యార్థులకు దాతల సహకారం ఎంతో అవసరమని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్‌ అన్నారు. శనివారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అదే గ్రామానికి చెందిన దాతలు విద్యార్థులకు స్పోర్ట్స్‌ డ్రెస్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు దాతలు సహకరిస్తే వారు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని చెప్పారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నారన్నారు. విద్యార్థులు భావిభారత నిర్మాతలని, వారి ఉజ్వల భవిష్యత్‌కు దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్‌ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం జ్యోత్స్న, మాజీ సర్పంచ్‌ పాండు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌ రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్‌రెడ్డి, కృష్ణ, ఉపాధ్యాయులు మహాదేవి, అరుణ, శ్రీనివాస్‌, గోవింద్‌, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఏసీపీ రంగస్వామి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ

షాద్‌నగర్‌రూరల్‌: ప్రతి ఒక్కరూ కొత్తగా వచ్చిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏసీపీ రంగస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని బుగ్గారెడ్డి ఫంక్షన్‌హాల్‌ ఆవరణలో పట్టణ సీఐ విజయకుమార్‌ ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ డ్రైవర్లకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ హాజరై మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన చట్టాల ప్రకారం లైసెన్సు, ఇన్సూరెన్స్‌ లేకుండా, మద్యం సేవించి వాహనాలను నడిపి ప్రమాదాలకు కారణమైన డ్రైవర్‌తో పాటుగా వాహన యజమానికి పదేళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. వాహనాలకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్‌ తీసుకోవాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వాహనాలను నడపొద్దని, వాహనాలను నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు నియమాలను పాటించి ప్రమాదాలను నివారించేందుకు కృషి చేయాలన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్‌, ఆర్సీ, ఇన్సూరెన్స్‌ను కలిగి ఉండాలని తెలిపారు. నేరాలను అదుపు చేసేందుకు ప్రజలు పోలీసులకు తమవంతు సహాయ సహకారాలను అందించాలన్నారు. ఎక్కడైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగినా, కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిటెక్టివ్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటేశ్వర్లు, ఎంవీఐ వాసు, ట్రాఫిక్‌ పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే

ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హిమబిందు

చేవెళ్ల: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ప్రశాంతంగా కొనసాగుతోందని ఎంపీడీఓ బి.హిమబిందు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న సర్వేను శనివారం సూపర్‌వైజర్లు పరిశీలించినట్లు తెలిపారు. సర్వే ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు దాదాపు 11,000వేల కుటుంబాల సర్వే విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలిపారు. ఇచ్చిన లక్ష్యాన్ని అనుకున్న సమయానికి పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి సర్వే వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని గ్రామాల్లో ప్రజలు సర్వేకు పూర్తి సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. సర్వేతో పాటు డేటా సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు డాటా ఎంట్రీ కోసం కూడా మండల పరిషత్‌ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 17వేలకుపైగా కుటుంబాలు ఉన్నట్లు స్టిక్కర్లు అతికించటం ద్వారా గుర్తించటం జరిగిందని తెలిపారు. కొన్ని కుటుంబాలకు ఒక్కటే స్టిక్కర్‌ వేయటంతో సర్వేలో రెండు కుటుంబాలుగా చెబుతుండటంతో కుటుంబాల సంఖ్య స్టిక్కర్లు అతికించిన దానికంటే ఎక్కువగా పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రతీ ఇంటిని వదలకుండా కుటుంబాల సర్వే పనులు చేయటం జరుగుతుందని చెప్పారు. త్వరలోనే అన్ని కుటుంబాల సర్వే పూర్తవుతుందన్నారు. ప్రజలు సర్వేకు సహకరించి సమాచారం అందించాలని సూచించారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న జంగయ్య

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

మొయినాబాద్‌: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శనివారం మొయినాబాద్‌లో నిర్వహించిన సీపీఐ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి గత ఎన్నికల ముందు పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ అమలు చేయాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలని సూచించారు. వంద సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న కమ్యూనిస్ట్‌ పార్టీ ఎన్నో ప్రజా పోరాటాలు చేసిందన్నారు. ఆ స్ఫూర్తితో కార్యకర్తలు పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్‌ రామస్వామి, మొయినాబాద్‌ మండల కార్యదర్శి శ్రీనివాస్‌, మహిళా సంఘం జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మంజుల, నాయకులు వెంకటయ్య, జలీల్‌, మోహన్‌రెడ్డి, సత్తయ్యగౌడ్‌, ప్రభాకర్‌, జాహంగీర్‌, రత్నయ్య, నరేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతోనే గెలుపు సాధ్యం

ప్రిన్సిపాల్‌ విద్యుల్లత



గెలుపొందిన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్‌: విద్యార్థుల్లో ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయని ప్రిన్సిపాల్‌ విద్యుల్లత అన్నారు. ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన 10వ జోనల్‌స్థాయి క్రీడాపోటీల్లో కమ్మదనం గురుకుల పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ఈ క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థినులను శనివారం ప్రిన్సిపాల్‌ విద్యుల్లత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ.. విద్యార్థినులు విద్యతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలన్నారు. తమకు ఇష్టమైన క్రీడలపై ఆసక్తి పెంపొందించుకొని నిరంతరం సాధన చేయాలని సూచించారు. క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. పోటీల్లో గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించాలని, ఓటమిని గెలుపునకు పునాదిగా మలుచుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థినులు ఇలాంటి క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల పీడీ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిర్సాముండా పోరాటం ఆదర్శం

గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నీతా



మాట్లాడుతున్న అధ్యాపకురాలు

షాద్‌నగర్‌రూరల్‌: గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం అహర్నిశలు పోరాడిన భగవాన్‌ బిర్సాముండాను ఆదర్శంగా తీసుకోవాలని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నీతా సూచించారు. పట్టణ సమీపంలోని నూర్‌ ఇంజినీరింగ్‌ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్‌ ఆధ్వర్యంలో భగవాన్‌ బిర్సాముండా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ విద్యార్థినిలతో కలిసి బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిర్సాముండా జీవిత చరిత్రపై విద్యార్థినిలకు వ్యాసరచన, క్విజ్‌ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి మహనీయుల జీవిత చరిత్ర, పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గిరిజన ప్రజల హక్కుల కోసం, సమస్యల పరిష్కారానికి బిర్సాముండా అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, భవిష్యత్‌లో ప్రతీ విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. దేశ భవిష్యత్‌ విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. దేశ భద్రతను కాపాడటంతో పాటుగా ప్రజల హక్కులకోసం నిరంతరం ఉద్యమించాలని అన్నారు. ప్రతిఒక్కరు సేవాదృక్పథాన్ని అలవర్చుకొని సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం..మహాదానం



అన్నదాత రాములును సన్మానిస్తున్న గురుస్వాములు

నందిగామ: మాల ధరించిన అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం మహాపుణ్యం అని గురుస్వామి గిరిషన్‌నాయర్‌ అన్నారు. మండల కేంద్రమైన నందిగామ శివారులోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం నిత్యాన్నదాన కార్యక్రమాన్ని గురుస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటిరోజు నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్‌ జంగారి రాములు ఆర్థికసాయంతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ.. ప్రతి ఏటా కార్తీక మాసంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, సుమారు రెండు నెలల పాటు నిత్యం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అన్నదాత రాములును గురుస్వాములు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు సుదర్శన్‌గౌడ్‌, తుమ్మల నర్సింహ, మాదారం నర్సింహ, ఎదిరే శ్రీకాంత్‌, దేపల్లి కుమార్‌గౌడ్‌, దేపల్లి అశోక్‌గౌడ్‌, చించేటి కృష్ణ, కావలి మల్లేశ్‌, కొమ్ము కృష్ణ, మెక్కొండ కుమార్‌గౌడ్‌ పాల్గొన్నారు.